సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 9 । జనవరి । 2024



'రామ్'ను ఆదరించాలి

దేశ భక్తి కథతో నిర్మించిన రామ్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని హీరో, విశాఖవాసి సూర్య కోరారు. 8లో



'చక్రవర్తి ఏనుగు' ఆవిష్కరణ

'చక్రవర్తి ఏనుగు' కథల సంపుటి బాలల సాహిత్యంలో ఉత్తమ రచనగా నిలుస్తుందని జేవీఎస్ మూర్తి అన్నారు. 8లో

నేటి నుంచి 'జన్ భాగీధారి'



జన్ భాగీధారి పేరిట మంగళవారం నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి చైతన్య కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి సంక్రాంతి సెలవులు



విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు సంక్రాంతి సెలవులు మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు ఇస్తున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సెలవుల్లో ఎటువంటి తరగతులు నిర్వహించకూడదన్నారు. ఉపాధ్యాయులకు కూడా ఎటువంటి తరగతులను నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఈ విషయంలో డిప్యూటీ డీఈవో, ఎంఈవోలదే బాధ్యత అన్నారు.

120 మంది మందుబాబులకు జరిమానా, జైలుశిక్ష

విశాఖ సిటీ: మద్యం తాగి వాహనాలు నడిపిన 120 మంది మందుబాబులకు కోర్టు రూ.5,94,500 జరిమానాతో పాటు ఇద్దరికి 8 రోజుల జైలు శిక్ష విధించింది. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన నిర్వహించిన తనిఖీల్లో వన్‌టౌన్, టూటౌన్, ఫోర్త్‌టౌన్, ద్వారకా, ఎంవీపీ, గాజువాక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 120 మంది పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపరచగా రూ.5,94,500 జరిమానా విధించింది. అలాగే ద్వారకా, ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరికి 8 రోజుల పాటు జైలు శిక్ష వేసింది.

ఏపీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు కలెక్టర్‌కు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు ఎంపీ శ్రీనివాస్, చిరంజీవి, జిల్లా ప్రధానాధ్యక్షుడు అవనా అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి త్రినాధమూర్తి, జిల్లా మహిళా కార్యదర్శి రామలక్ష్మి, జిల్లా కోశాధికారి, నగర శాఖ కార్యదర్శి ఎం ఎన్ వి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం

తాటిచెట్లపాలెం : రైళ్లలో గంజాయి రవాణా, దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈమేరకు నిఘా మరింత పటిష్టం చేయనున్నట్టు సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు రాహుల్ దేవ్ పేర్కొన్నారు. విశాఖ రైల్వేస్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రైళ్లలో జరిగే దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా వంటి విషయాలపై పరిధిలో రైల్వే పోలీస్ అధికారులతో చర్చించారు. రైళ్లలో దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా జరగకుండా సీసీ కెమెరాలు, లగేజీ స్కానర్లు, మెటల్ డిటెక్టర్లతో, స్నిఫర్ డాగ్‌ల సహాయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాహుల్‌దేవ్ తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నంలకు చెందిన డిప్యూటీ సూపరింటిండెంట్ ఆఫ్ రైల్వే పోలీసులు, ఇన్‌స్పెక్టర్లు, లైన్స్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్లో భోగి మంట వద్ద సందడి

సంక్రాంతి పండుగ అందమైన ముగ్గులకు, గొబ్బెమ్మలకు, హరిదాసు పాటలకు, బసవన్నల ఆటలకు, మిఠాయిలకు, గాలిపటాలు ఎగురవేయడానికి, మరెన్నో సంబరాలకు ప్రసిద్ధి. అంతటి సంబరాల సంక్రాంతిని విశాఖ నగరంలో ముందస్తుగా నిర్వహించారు. వేడుకలు మన సంస్కృతీసంప్రదాయాలు చాటి చెప్పాయి. వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో పండగ కళ వచ్చింది. విద్యార్థులు సందడిగా గడిపారు. ముత్యాల ముగ్గులువేశారు. హరిదాసుల వేషధారణలో మెప్పించారు. భోగి మంట వేసి..సంక్రాంతికి వెల్‌కమ్ చెప్పారు.



హరిదాసు వేషధారణలో విద్యార్థి





సీతమ్మధార ఎన్‌ఎంసీహెచ్ స్కూల్ గ్రౌండ్‌లో భోగి మంట వద్ద విద్యార్థుల సందడి, ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయులు



మింది జెడ్పీ హైస్కూల్‌లో బసవన్నను తాకుతున్న డీఈవో చంద్రకళ



ఆళ్వార్‌దాస్ స్కూల్ ప్రాంగణంలో..

వేడుక అదిరింది



సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి భోగిమంటతో శ్రీకారం చుట్టారు. హరిదాసు వేషధారణలో విద్యార్థినులు..సంప్రదాయ దుస్తులు..రంగు రంగుల రంగవల్లులతో కళాశాల ప్రాంగణం శోభాయమానంగా మారింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థినులు అలరించారు. తెలుగు విభాగాధిపతి, కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీ పద్మకుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి.అరుణపద్మ, తెలుగుఅధ్యాపకురాలు బి.రాధమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.



హరిదాసుకు బియ్యం వేస్తూ...

వైఎస్సార్‌సీపీలో మహిళలకు అగ్రతాంబూలం

- మహిళా విభాగం మరింత బలోపేతం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత కల్పించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. సోమవారం ఎండాడ లా కళాశాల సమీపంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 55 నెలల జగనన్న పాలనలో మహిళల పేరిట సంక్షేమ పథకాలు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తూ అసెంబ్లీలో ఏకంగా చట్టం తీసుకువచ్చారని తెలిపారు. రాజ్యాంగం ఇచ్చిన పదవుల కంటే జగనన్నే మహిళల కోసం ఎక్కువ పదవులు ఇచ్చారని కొనియాడారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌తో సహా నలుగురు మహిళలకు మంత్రి పదవులు, ఇద్దరి ఎమ్మెల్సీలు ఇచ్చారన్నారు. గత ఎన్నికల్లో డ్వాక్రా రుణమాఫీ, వైఎస్సార్ ఆసరాతో పాటు మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. ఎన్నికలకు ఇంకా మూడు నెలలే ఉన్న నేపథ్యంలో మహిళ విభాగం మరింత బలోపేతమై ముఖ్యమంత్రి మహిళలకు చేసిన మేలును ప్రజలకు తెలియజేయాలన్నారు. వీలైనంత మేర మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు మంతెన మాధవి వర్మ, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కోలగట్ల శ్రావణి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శ్రీదేవి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపాజ్యోతి, అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, రాష్ట్ర, జిల్లా పార్టీ మహిళా నేతలు చింతాడ మంజు, అనురాధ, రాజేశ్వరి, సత్యలత, ఆర్.నారాయణమ్మ, కె.విజయ వినీత, ఎం.మల్లేశ్వరి, ఎం.జ్యోతిరాణి పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మహిళా నేతలు

ఆ మూడు సంస్థల బోట్లకే అనుమతులు

- గుర్తింపు లేకుండా నడుపుతున్న సంస్థపై చర్యలు
- వెల్లడించిన పర్యాటక శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, విశాఖపట్నం : పర్యాటక శాఖ అనుమతులతో వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్న సంస్థలనే టూరిస్టులు ఆశ్రయించాలని ఏపీటీడీసీ అధికారులు సందర్శకులకు విజ్ఞప్తి చేశారు. బ్లూఫ్లాగ్ బీచ్‌గా ఉన్న రుషికొండలో ఏపీటీడీసీతో పాటు లివిన్ అడ్వెంచర్స్, ఫన్ అడ్వెంచర్స్ సంస్థలు మాత్రమే స్పీడ్ బోట్స్, జెట్‌స్కై, స్కూబా డైవింగ్ వంటి వాటర్‌స్పోర్ట్స్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అనధికారికంగా స్పీడ్ బోట్లు నిర్వహిస్తున్నారంటూ సాక్షిలో 'నీటిలో ఆటలు.. టూరిజం కళ్లకు గంతలు' శీర్షికన సోమవారం ప్రచురించిన కథనంపై ఏపీటీడీసీ అధికారులు స్పందించారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని వాటర్‌స్పోర్ట్స్ నిర్వహించేందుకు ముందుకు వచ్చే సంస్థలు ఏపీటీడీసీతో అగ్రిమెంట్ చేసుకున్నాయని వెల్లడించారు. వాటర్ స్పోర్ట్స్ యాక్టివిటీస్ మొత్తం అక్కడ ఉండే కంట్రోల్‌రూమ్ ఆధీనంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఎందుకంటే వాతావరణం అనుకూలంగా లేకపోయినా.. భద్రతా చర్యలు పాటించకపోయినా ఆ బోట్లను నిలిపివేస్తూ.. మొత్తం వ్యవస్థని కంట్రోల్‌రూమ్ పర్యవేక్షిస్తుంటుందని తెలిపారు. స్పీడ్ బోట్స్ నడిపేందుకు కూడా కంట్రోల్ రూమ్ ఒక నిర్దిష్టమైన సేఫ్టీరూట్‌ని ఎంపిక చేసిందనీ.. ఆ రూట్‌లో మాత్రమే బోట్లు నడపడం వల్ల పర్యాటకులు ఎలాంటి ప్రమాదాలకు గురికారని తెలిపారు. ఇటీవల మంగమారిపేటలో అనధికారికంగా యూపీకి చెందిన వ్యక్తి వాటర్‌స్పోర్ట్స్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిన విషయం నిజమేనని తెలిపారు. సదరు వ్యక్తి చేస్తున్న కార్యకలాపాల్ని నిలుపుదల చేసి.. కేసు నమోదు చేసేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. ఎక్కడైనా అనధికారికంగా వాటర్ స్పోర్ట్స్ నడుపుతున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఏపీటీడీసీ అధికారులు పర్యాటకులను కోరారు.

నేడే మహా బడ్జెట్

- ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు
- అన్ని పద్దుల కింద జమ : రూ.4,949.89 కోట్లు
- అన్ని పద్దుల కింద ఖర్చులు : రూ.5,457.23 కోట్లు
- ముగింపు నిల్వ : రూ.156.99 కోట్లు



డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 2024–25 వార్షిక బడ్జెట్ సమావేశం మంగళవారం జరగనుంది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనున్న సర్వసభ్య సమావేశంలో సభ్యులు బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలపనున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు. అన్ని పద్దుల కింద జమలు రూ.4,949.89 కోట్లు. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తంగా జమలు రూ.5,614.22 కోట్లు కాగా.. అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.5,457.23 కోట్లు. ముగింపు నిల్వ రూ.156.99 కోట్లుగా నిర్ణయించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను సవరించిన అంచనా బడ్జెట్‌ను ఇటీవల మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో చర్చించి ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ నగర పాలక సంస్థ చట్టం 1955లోని 185 సెక్షన్ ప్రకారం కార్పొరేషన్ ఆమోదం తెలపాల్సి ఉంది.

ఆనందమానందమాయె..

- సామాజిక పింఛన్ పెంపుపై సర్వత్రా హర్షం
- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



44వ వార్డు అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లోని షాదీఖానాలో లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉత్తర సమన్వయకర్త కేకే రాజు



18వ వార్డులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ధనలక్ష్మి

జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ పండగలా కొనసాగుతోంది. పింఛన్ల మొత్తం రూ.3 వేలకు పెంచిన నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. వాడవాడలా లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

జగనన్నకు చెబుదాంకు 123 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 123 వినతులు వచ్చాయని కమిషనర్ సాయికాంత్ వర్మ చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, సీసీపీ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, డీసీ (రెవెన్యూ) ఫణిరాం పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం(జేకేసీ)కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కరించాలని, ఆ దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు.

సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జేసీ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్వో కె. మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 322 అర్జీలను స్వీకరించారు.వీటిలో రెవెన్యూ శాఖకు 131, జీవీఎంసీకి 83, పోలీసు శాఖకు 24, ఇతర విభాగాలకు 84 వినతులు అందాయి. కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ వర్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో మోహన్‌కుమార్

పోలీస్ స్పందనకు 80 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఏడీసీపీ (అడ్మిన్)ఎం.ఆర్.కె.రాజు

విశాఖ సిటీ: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 80 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆధునిక బాలసాహిత్యం చక్రవర్తి ఏనుగు

సీతంపేట: ఆధునిక బాల సాహిత్య లక్షణాలతో పాటు మానవీయత అంతర్లీనంగా ఉన్న 'చక్రవర్తి ఏనుగు' పిల్లల కథల సంపుటి నేటి బాల సాహిత్యంలో ఉత్తమ రచనగా నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎస్.హనుమంతరావు రచించిన 'చక్రవర్తి ఏనుగు' (పిల్లల కథలు) సంపుటిని సోమవారం సాయంత్రం పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోని పద్ధతులు, ఆచారాలను నేటి తరం పిల్లలకు అర్థమయ్యే రీతిలో కథలు ఉన్నాయన్నారు. వలస జీవుల జీవితాల మార్పు, వారి జీవన విధానం ఆలోచనలు విధానాలను సున్నితంగా కథల రూపంలో ప్రస్తావించిన తీరు అద్వితీయమన్నారు. ప్రముఖకవి గరిమెళ్ల నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు , బేతా రామసూర్య ప్రకాశరావు, రామకృష్ణ, ఎంవీవీ సత్యనారాయణ, డీవీ సూర్యారావు, సత్యనారాయణ,ఎం పైడిరాజు, సీఎస్ క్షేత్రపాల్, పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

'రామ్'ను ఆదరించాలి

బీచ్‌రోడ్డు: దేశ భక్తి కథతో నిర్మించిన రామ్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని హీరో, విశాఖవాసి సూర్య అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో చిత్ర యూనిట్ మీడియా సమావేశం నిర్వహించింది. రామ్ చిత్రాన్ని ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విడుదల చేస్తున్నామన్నారు. సీనియర్ నటులు సాయికుమార్, సుభలేఖ సుధాకర్, బాలచంద్రుడు నటించారన్నారు. హీరోయిన్ ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ గొప్ప దేశ భక్తి చిత్రంలో నటించడం ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో నటుడు కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'జన్ భాగీధారి'

- జిల్లా కేంద్రంలో చైతన్య కార్యక్రమాలు
- నేడు అంబేడ్కర్ జంక్షన్ నుంచి మారథాన్
- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్

మహారాణిపేట: అమరావతిలోని స్వరాజ్ మైదానంలో ఈ నెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో జన్ భాగీధారి పేరిట మంగళవారం నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి చైతన్య కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ఎల్ఐసీ బిల్డింగ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి రామాటాకీస్ వద్దనున్న అంబేడ్కర్ భవన్ వరకు మారథాన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి రక్తదాన కార్యక్రమం, జిల్లా స్థాయి ఫొటో ఎగ్జిబిషన్, అంబేడ్కర్ జీవిత చరిత్రపై షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేస్తామన్నారు. అదే విధంగా సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో మంగళ, బుధవారాల్లో రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. 18న ఉదయం 9 గంటలకు ఎల్ఐసీ భవనం వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలతో ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

విశాఖ సిటీ: విశాఖలో అనధికార మద్యం దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బెల్టు షాపులపై నిఘా పెట్టాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు ఏడీసీపీ(ఎస్‌బీ) నాగేంద్రుడు పర్యవేక్షణలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అనధికార మద్యం షాపులపై నిఘా పెట్టారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో అనేక ప్రాంతాల్లో 51 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. భీమిలి పరిధిలో ఎగువపేట గ్రామంలో ఉన్న బెల్ట్‌షాప్‌లో 15 క్వార్టర్ బాటిళ్లు, పీఎం పాలెం పరిధిలో వాంబే కాలనీలో ఒక ఇంట్లో 16, కంచరపాలెం పరిధిలో జ్ఞానాపురంలో ఉన్న ఒక ఇంట్లో 20 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

బులియన్..

బంగారం (10 గ్రాములు)
24 కేరట్లు: రూ.63,050
22 కేరట్లు: రూ.57,800
వెండి (కిలో): రూ.77,800

చికెన్ (కిలో)

ఫారం ధర : రూ.65
బ్రాయిలర్ (లైవ్): రూ.85
స్కిన్ : రూ.140
స్కిన్ లెస్ : రూ.150


పింక్ మొబైల్‌లోనే తల్లిపాలిచ్చే గది


అత్యాధునికంగా మహిళల మొబైల్ టాయిలెట్స్

మహిళలకు మాత్రమే..

- అందుబాటులో రెండు పింక్ మొబైల్ టాయిలెట్లు
- త్వరలోనే మరికొన్ని అందుబాటులోకి..


మహిళల కోసం ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన మొబైల్ టాయిలెట్


మొబైల్ టాయిలెట్స్

డాబాగార్డెన్స్: మహా విశాఖ నగరం పర్యాటకంగా విస్తరిస్తోంది. పర్యాటకుల తాకిడి నానాటికీ పెరుగుతోంది. అందుకు అనుగుణంగా జీవీఎంసీ ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోంది. దీనిలో భాగంగానే మహిళల కోసం ప్రత్యేకంగా రెండు మొబైల్ పింక్ టాయిలెట్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటిని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఇటీవల ప్రారంభించారు.

స్వచ్ఛ విశాఖే లక్ష్యంగా..

జీవీఎంసీకి చెందిన రెండు బస్సులను సుమారుగా రూ.11.5 లక్షలతో మొబైల్ పింక్ టాయిలెట్స్‌గా ఆధునికీకరించారు. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ విశాఖే లక్ష్యంగా టాయిలెట్ 2.0 ఛాలెంజ్‌లో భాగంగా 20 టాయిలెట్లను నగరంలో ప్రత్యేకంగా అభివృద్ధి చేయనున్నారు. దీనిలో భాగంగానే రెండు మొబైల్ పింక్ టాయిలెట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు.

మొబైల్ పింక్ టాయిలెట్స్‌లో..

జీవీఎంసీ శ్రీకారం చుట్టిన మొబైల్ పింక్ టాయిలెట్స్‌లో చాలా వరకు వెస్ట్రన్ స్టైల్ టాయిలెట్, వాష్ బేసిన్, ఇండోర్ లైటింగ్, ఫ్యాన్, ఇన్‌సినరేటర్ యూనిట్, నాప్కిన్ వెండింగ్, ఇన్సినరేటర్‌తో కూడిన డైపర్ డిస్పెన్సరీ, ఓటింగ్ మెషిన్ (టాయిలెట్ ఎంత శుభ్రంగా ఉందో ఫీడ్‌బ్యాక్ కోసం), తగిన సీట్లతో కూడిన బేబీ ఫీడింగ్ రూమ్ వంటి సౌకర్యాలు కల్పించారు.

ఇవి ఎక్కడెక్కడ ఉంటాయంటే..

బీచ్‌రోడ్డు, రద్దీ ప్రాంతాలు, పబ్లిక్ మీటింగ్‌ల వద్ద.

మహిళల ఇబ్బందులు తెలుసుకొని..



టాయిలెట్స్ విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 20 టాయిలెట్స్‌ను నగరంలో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నాం. దీనిలో భాగంగా ఇటీవల 2 మొబైల్ పింక్ టాయిలెట్స్ అందుబాటులోకి తెచ్చాం. వీటిని రద్దీ ప్రాంతాలు, పబ్లిక్ మీటింగ్స్, బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేయనున్నాం.

గొలగాని హరి వెంకటకుమారి,
మేయర్, జీవీఎంసీ

గజ..గజ

సాక్షి,పాడేరు: జిల్లాలో చలి గాలులు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి చలితీవ్రత పెరిగింది. ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. పాడేరు మండలం మినుములూరులో 8 డిగ్రీలు, చింతపల్లిలో 11.5డిగ్రీలు, అరకులోయలో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఇంటర్ పరీక్ష కేంద్రాలపై కసరత్తు

- జిల్లాలో 168 కాలేజీలకు ప్రభుత్వ గుర్తింపు
- పరీక్షలకు హాజరుకానున్న 77,175 వేల మంది విద్యార్థులు
- సౌకర్యాలు ఉన్న కాలేజీలనే కేంద్రాలుగా ఎంపిక
- క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేస్తున్న అధికారులు
- హాస్టళ్లు నిర్వహించే కాలేజీలకు నో చాన్స్


గోపాలపట్నం ప్లస్-2 స్కూల్లో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అనువైన కేంద్రాల ఎంపికపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతులు, భద్రత, రవాణ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రాల ఎంపికకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్ఐవో, డీవీఈవోల నేతృత్వంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, క్షేత్రస్థాయిలో కాలేజీలను పరిశీలిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న 168 కాలేజీలకు 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ బోర్డు గుర్తింపు ఇచ్చింది. వీటిలో మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న 77,175 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మరో 5,221 మంది ప్రైవేటు (గతంలో పరీక్షలు తప్పినవారు) పరీక్షలు రాయనున్నారు.

పారదర్శకంగా పరీక్షలు

పరీక్షలు సజావుగా నిర్వహించడంలో కేంద్రాల ఎంపిక కీలకం కానుంది. అందుకనే ఇంటర్ బోర్డు అధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా కేటాయించిన రూమ్‌లో ఒక్కో బెంచిపై ఇద్దరు విద్యార్థులకు మాత్రమే సీటింగ్ కేటాయించేలా కేంద్రాలను గుర్తిస్తున్నారు. ఐదు అడుగులలోపు ఉన్న టేబుల్‌తై ఒక్క విద్యార్థికే సీటింగ్ కేటాయించనున్నారు. మార్చి 1 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 2న, ఎథిక్స్, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జరగనుంది. వీటి నిర్వహణకు జిల్లాలో 1,751 మంది అధ్యాపకుల వివరాలను ఆన్‌లైన్‌లో ఇప్పటికే నమోదు చేశారు.

ఆ కాలేజీలకు నో చాన్స్

పరీక్ష కేంద్రాల ఎంపికలో ఇంటర్ బోర్డు అధికారులు ఈసారి కఠినంగానే వ్యవహరిస్తున్నారు. విశాఖలో కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో రెసిడెన్షియల్ పేరిట హాస్టళ్లు సైతం నిర్వహిస్తున్నారు. ఇలాంటి కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉండటంతో, జిల్లా అధికారులు సమగ్ర పరిశీలన చేస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరం వరకు ఉన్న జాబితాలో జిల్లాలో 78 కాలేజీల్లో కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈసారి వీటిలో 23 కాలేజీలను పక్కన పెట్టారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని జిల్లా అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలో పెరగనున్న కేంద్రాలు

ఈ ఏడాది జిల్లాలో ఇంటర్ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇందుకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసేందుకు అధికారులు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. గుర్తించిన కాలేజీల్లో అందుబాటులో ఉన్న రూములు, అక్కడ ఉన్న వసతులను పరిగణలోకి తీసుకొని 90 కేంద్రాలను ఎంపిక చేసేలా ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

పకడ్బందీగా కేంద్రాల ఎంపిక



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బోర్డు ఉన్నతాధికారుల నుంచి సూచనల మేరకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్న కాలేజీలనే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేస్తున్నాం. ఇప్పటికే 60 కాలేజీలను గుర్తించి, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. మరో 35 కేంద్రాల పరిశీలన జరుగుతోంది. సాధ్యమైనంత త్వరలోనే వీటి ఎంపిక పూర్తి చేస్తాం.

– రాయల సత్యనారాయణ, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

సౌకర్యాలన్నీ ఉంటేనే సిఫార్సు



ఇంటర్ పరీక్షలకు మెరగైన సౌకర్యాలు ఉన్న కాలేజీలనే గుర్తిస్తున్నాం. ఈ విషయంలో కఠినంగానే వ్యవహరిస్తున్నాం. మా వద్ద అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో కాలేజీలను పరిశీలిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కేంద్రాల జాబితా సిద్ధం చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

– బి.రాధ, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, విశాఖ

చోరీ సొత్తు స్వాధీనం

18 మంది నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏసీపీ వెంకటరావు

భీమునిపట్నం : పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డ నిందితులను క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. విశాఖ నగరానికి చెందిన అన్నెపు ఆంజనేయులు, వనం సూరిబాబు, హరికృష్ణ, ఉప్పాడ శ్యాంసన్, బర్రె చైతన్య, గేదెల రమణమూర్తి, డెక్కతి సాయికుమార్, రిక్కా దుర్గారావు, మన్యాల హనుమంతరావు, బొక్కెల ప్రశాంత్‌కుమార్, చెల్లా ధనుంజయ భీమిలి నాల్గవ వార్డు పరిధిలో కాపులుప్పాడ, కె.నగరపాలెం వద్ద నాగోతు వెంకటేష్, గేదెల సత్తిబాబు డ్రైనేజీ నిర్మాణం కోసం తీసుకొచ్చిన రూ. 2.10 లక్షల విలువైన ఇనుప సెంటరింగ్ షీట్లను అపహరించుకుపోయారు. అలాగే పూసపాటిరేగ, పైడిభీమవరం ప్రాంతానికి చెందిన లెంక శ్రీను, కొండ్రు రామకృష్ణ, కోనాడ గోవిందరావు, మానంకొండ సుందర రామిరెడ్డి, అడపాక గణేష్ ఆనందపురం సమీపంలో ఓ ప్రైవేటు సంస్థకు చెందిన సెల్ టవర్ వద్ద రూ.13వేలు విలువైన బ్యాటరీ సెల్స్ చోరీ చేశారు. పీఎంపాలెం, మధురవాడ ప్రాంతానికి చెందిన చూచుకొండ సాయి, ఆర్.సాయినాథ్ పీఎం పాలెం పరిధిలో కళ్యాణ వేంకటేశ్వస్వామి దేవాలయం హుండీతోపాటు మరికొన్ని చోరీలకు పాల్పడ్డారు. వీరిని సోమవారం పలు ప్రాంతాల్లో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ 2.60 లక్షల నగదు, చోరీకి పాల్పడ్డ ఇనుప సెంటరింగ్ షీట్లు, బ్యాటరీ సెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ సురేష్, ఎస్ఐ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

వివేకానంద జయంత్యుత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

డాబాగార్డెన్స్: పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న స్వామి వివేకానంద జయంత్యుత్సవాల పోస్టర్‌ను శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిజీ ఆవిష్కరించారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు గాయత్రీ హోమం, మధ్యాహ్నం 3 గంటలకు రంగవల్లుల పోటీలు, సాయంత్రం 6 గంటలకు వివేకానంద విగ్రహంతో ర్యాలీ చేపట్టనున్నట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. 11న సాయంత్రం 6 గంటలకు సంకీర్తన కార్యక్రమం, 12న ఉదయం 10 గంటలకు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, సాయంత్రం 6 గంటలకు వివేకానంద యువజన దినోత్సవాల కూచిపూడి నృత్యం, పేదలకు దుప్పట్లు పంపిణీ ఉంటుందని, 13న సాయంత్రం 6 గంటలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఏటా వివేకానంద జయంత్యుత్సవాల పోస్టర్‌ను స్వామిజీ చేతుల ఆవిష్కరిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భాను, పైడిరాజు, మహిళా సభ్యులు ఉమాదేవి, నాగమణి, రాణి, సావిత్రి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

కెమికల్ కళాశాలలో ఇంటర్వ్యూలు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో సోమవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. సుజ్లాన్ గ్లోబల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో డిప్లమా మెకానికల్, బీటెక్ ఎలక్ట్రికల్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 187 మంది పాల్గొన్నారు. వీరికి సాంకేతిక పరీక్షలతోపాటు, రాత పరీక్షలు నిర్వహించారు. మంగళవారం కూడా ఇంటర్వ్యూలు కొనసాగుతాయని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. 2022, 23 ఉత్తీర్ణులైన వారు ఈ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావచ్చన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బోల్తాపడిన కంటైనర్

పరవాడ: లంకెలపాలెం–పరవాడ రహదారిలో సోమవారం భారీ కంటైనర్ బోల్తా పడింది. ప్రమాదంలో ఓ ఆటో నుజ్జునుజ్జవ్వగా ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో లంకెలపాలెం నుంచి పరవాడ వైపు వస్తున్న భారీ కంటైనర్ మండల కాంప్లెక్సు కూడలికి రాగానే అదుపు తప్పి ఓ ఫాన్ షాపు వద్ద పార్క్ చేసిన ఆటోపై బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. బోల్తా పడిన కంటైనర్‌లో డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపయం నుంచి బయట పడ్డాడు. సమాచారం అందుకున్న పరవాడ పోలీసులు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


గౌరి మృతదేహం

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తొమ్మిదో వార్డు పరిధి హనుమంతవాక రామాలయం వీధిలో తాటి గౌరి (36) సోమవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. సీలింగ్ ఫ్యాన్‌కు చీర కట్టి ఉరి వేసుకొన్నాడు. గౌరి వెల్డింగ్ వర్క్ చేస్తుండేవాడు. అతనికి భార్యాఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు కారణంగా కొన్నాళ్ల నుంచి అతని భార్య చిన్న కుమారుడితో కలిసి ఆమె కన్నవారింట్లో ఉంటోంది. పెద్ద కుమారుడు, గౌరి..ఆయన తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గౌరి మనస్తాపం చెంది ఉరి వేసుకున్నాడు. విషయం తెలుసుకొన్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ ఎ.ఐ సీహెచ్ హరికృష్ణ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–తిరుపతి (08583) స్పెషల్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా సోమవారం రాత్రి 11 గంటలకు బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సి ఉంది.

ఉమామహేశ్వరరావుకు ఎన్ఎస్ఎస్ రాష్ట్ర స్థాయి అవార్డు



మద్దిలపాలెం : డాక్టర్.వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావుకు ఎన్ఎస్ఎస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈనెల 12వ తేదీన మంగళగిరిలో జరగనున్న కార్యక్రమంలో అవార్డు తీసుకోనున్నారు. ఆయన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.విజయబాబు అభినందించారు.

యువ తరంగం
ఉరిమే ఉత్సాహం

- ముగిసిన కల్చరల్ ఫెస్ట్
- నేడు బహుమతుల ప్రదానోత్సవం


స్కిట్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు


ఇస్రో విజయాలపై స్కిట్


మైమ్ కళాకారుల ప్రదర్శన

ఏయూక్యాంపస్: యువతలోని అంతర్లీనంగా ఉన్న కళాప్రతిభను పోత్సహించే వేదికగా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్ నిలిచింది. ఏయూ వేదికగా నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న కల్చరల్ ఫెస్ట్‌లో పోటీలు సోమవారంతో ముగిశాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహుమతుల ప్రధానోత్సవం జరగనుంది. నాల్గవరోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం పాశ్చాత్య బృందగీతాలు, మైమ్, క్లాసికల్ వోకల్ సోలో, కార్టూనింగ్, డిబేట్ పోటీలు, మధ్యాహ్నం నుంచి ఫోక్ డ్యాన్స్, ట్రైబల్ డ్యాన్స్, ఇనస్టలేషన్, స్కిట్, మెహందీ పోటీలను నిర్వహించారు. నాలుగు రోజులుగా వేదికపై ఒకరితో ఒకరు పోటీపడి నర్తించి. నటించి, ఆడి పాడి అందరి మనసులను గెలుచుకున్నారు. కార్యక్రమాన్ని ఏఐయూ అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర పర్యవేక్షించగా, ఏర్పాట్లు ఏయూ కల్చరల్ కో ఆర్డినేటర్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ పరిశీలించారు. కార్యక్రమంలో నాలుగు రాష్ట్రాల నుంచి 23 విశ్వవిద్యాలయాలకు చెందిన 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏయూ నిర్వహించిన విధానం, ఏర్పాట్లపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ఐటీలో మేటి మన శ్రీధర్

- దేశవిదేశాల అవార్డులు సొంతం చేసుకుంటున్న శ్రీధర్‌రెడ్డి తాజాగా భారత్ భూషణ్–2023 అవార్డు


ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న శ్రీధర్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ఐటీఈసీ విభాగంలోని ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ (ఎపిటా) జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీధర్‌రెడ్డి తాజాగా భారత్ భూషణ్–2023 అవార్డుకు ఎంపికయ్యారు. ఎపిటా ఐటీ ప్రమోషన్స్ జీఎం వి.శ్రీధర్‌రెడ్డి దాదాపు నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన బీచ్‌ఐటీ కాన్సెప్ట్‌ను ప్రపంచ దేశాల్లోని దిగ్గజ సంస్థలకు పరిచయం చేయడంలో శ్రీధర్‌రెడ్డి ముఖ్యభూమిక వహించారు. విశాఖ కేంద్రంగా గతేడాది మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023లో ఐటీ రంగంలో పెట్టుబడులు తీసుకురావడంలోనూ శ్రీధర్ రెడ్డి పాత్ర ఎంతో ఉంది. ఐటీ రంగంలో శ్రీధర్‌రెడ్డి అందించిన సేవలకు గతేడాది సెప్టెంబర్‌లో మింట్‌బిజినెస్ అందించే మోస్ట్ ప్రామినెంట్ ఐటీ అండ్ ఐటీఈఎస్ ఇండస్ట్రీ లీడర్–2023కి ఏపీ నుంచి ఎంపికయ్యారు. అదేవిధంగా ఏపీలో బిజినెస్ డెవలప్‌మెంట్, ఐటీ, ఫైనాన్స్ రంగంలో అందిస్తున్న సేవలకు గానూ బ్రిటిష్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌మేరీ గౌరవ డాక్టరేట్‌ను అక్టోబర్‌లో అందజేసింది. అదే నెలలో ఇండియన్ ఎచీవర్స్ ఫోరమ్ శ్రీధర్‌రెడ్డిని మేన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్–2023 అవార్డును అందించింది. అంతర్జాతీయ సంస్థ ది గ్లోబల్ చాయిస్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఐటీ పేరుతో సత్కరించింది. ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఎచీవర్స్ కాన్ఫరెన్స్‌లో ఐటీ అండ్ ఫైనాన్స్‌లో అవుట్‌స్టాండింగ్ ఎచీవ్‌మెంట్ అవార్డును అందజేసింది. తాజాగా అంబేడ్కర్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మక భారత రత్న డా. బీఆర్ అంబేడ్కర్ భారత్ భూషణ్–2023 అవార్డుతో శ్రీధర్‌రెడ్డిని సత్కరించింది. లండన్ పార్లమెంట్ సైతం మహాత్మా గాంధీ మెడల్‌ని అందజేసింది. వీటితో పాటు అనేక అవార్డులు ఈ ఏడాది శ్రీధర్ రెడ్డి దక్కించుకున్నారు.

ఐటీలో గ్లోబల్ లీడర్‌గా ఏపీ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా బీచ్ ఐటీ కాన్సెప్ట్‌తో విశాఖలోనూ, ఐటీ పార్కులతో విజయవాడ, తిరుపతి నగరాల్లో ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు కార్యకలాపాలు నిర్వహించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నా. రాష్ట్ర ఆర్థిక, సాంకేతిక లక్ష్యాలకు అనుగుణంగా వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు వ్యూహాలను నిర్దేశించుకున్నాను. ప్రభుత్వం నాపై పూర్తి విశ్వాసాన్ని ఉంచి బాధ్యతలు అప్పగించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో ఉన్న ఏపీని.. ఐటీ రంగంలోనూ గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టాలన్నదే నా ఆకాంక్ష.

– వి.శ్రీధర్‌రెడ్డి ఎపిటా (ఐటీ ప్రమోషన్స్) జీఎం

బ్రాహ్మణ అగ్రహారాల ఏర్పాటుకు రుణాలు


ప్రసాద్

మహారాణిపేట: బ్రాహ్మణ అగ్రహారాలు ఏర్పాటు చేయడం కోసం 30 నుంచి 40 మంది బ్రాహ్మణులు ఒకే ప్రాంతంలో స్థలం కొనుగోలు చేయడానికి రుణాలు మంజూరు చేస్తున్నామని బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ అమ్మ ప్రసాదు చెప్పారు. సోమవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ స్థల ఖరీదులో 25 శాతం చెల్లిస్తే 75 శాతం రుణం మంజూరు చేస్తామన్నారు. రుణానికి వారు కొనుగోలు చేసే స్థలాన్ని గ్యారెంటీగా తీసుకుంటామని చైర్మన్ వివరించారు. తమ సొసైటీ ద్వారా రూ.50 వేల నుంచి రూ.5 కోట్ల వరకు రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో బ్రాహ్మణ కార్పొరేషన్, సొసైటీ చక్కగా పనిచేస్తున్నాయన్నారు. బ్రాహ్మణుల వ్యాపారాభివృద్ధి కోసం ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కోట్లాది రూపాయలు రుణాలు మంజూరుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీలో 74,500 మంది సభ్యులు ఉన్నారని, 600మంది డిపాజిట్‌దారులు తమ సొసైటీలో రూ.40 కోట్ల మేర డిపాజిట్లు చేశారని చైర్మన్ పేర్కొన్నారు. తమ సొసైటీ ద్వారా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. రుణాల మీద దాదాపుగా 99.5 శాతం రికవరీ జరుగుతుందన్నారు. దేశంలో ఉన్న అన్ని సొసైటీల కంటే బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ చక్కగా పనిచేస్తోందని తెలిపారు. ఇప్పటివరకు రూ.95 కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. అదేవిధంగా ఉన్నత విద్యనభ్యసించే వారికి విద్యాభారతి పేరిట రుణాలు కూడా మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ రుణ మొత్తాన్ని తిరిగి 8 ఏళ్లలో తీర్చే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ నెలలో విశాఖలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభిస్తున్నామన్నారు.

అలాగే దేవాలయాలు ప్రాంగణంలో బ్రాహ్మణుల చేత పూజా సామగ్రి స్టోర్స్ ఏర్పాటు చేయడానికి రుణాలు మంజూరు చేయనున్నామన్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖతో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. జీసీసీ స్టాల్స్ మాదిరిగా బ్రాహ్మణ కో ఆపరేటివ్ డిపార్టుమెంట్ స్టోర్స్‌ను కూడా ప్రారంభించాలని ఈ మేరకు విధి విధానాల రూపొందిస్తున్నట్లు చెప్పారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, విమానాశ్రయ ప్రాంగణాల్లో కూడా బ్రాహ్మణ కో ఆపరేటివ్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి

తుమ్మపాల : భారత ప్రభుత్వ సంస్థ (సీపీఈటీ), ఎన్టీపీసీ సింహాద్రి (విజయవాడ) సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు సీపీఈటీ జాయింట్ డైరెక్టర్, హెడ్ సీహెచ్.శేఖర్ తెలిపారు. ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికత ఉండి, 10 వ తరగతి పాసై 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గల 60 మందికి విజయవాడ పోలిమెర్స్ టెక్నాలజీలో 6 నెలల నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందించనున్నట్టు తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, హోసూ ర్, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3వేలు స్టైఫండ్ ఇస్తామన్నారు. ఆసక్తి గల యువత సీపీఈటీ ప్రతినిధిని 7893586494 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విశాఖ కుర్రాళ్లు కుమ్మేశారు

- బెంగాల్‌తో రంజీ మ్యాచ్‌లో సత్తా
- రాణించిన రికీబుయ్, శశికాంత్, నితీష్


రికీబుయ్ సెంచరీతో అభివాదం

విశాఖ స్పోర్ట్స్ : రంజీ ట్రోఫీ సీజన్ తొలి మ్యాచ్‌లో ఎలైట్ గ్రూప్ బిలో ఆంధ్ర తరఫున ఆడిన విశాఖ కుర్రాళ్లు కుమ్మేశారు. బెంగాల్‌తో వైఎస్ఆర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తరఫున ముగ్గురూ ఆటగాళ్లు ఆడారు. టాపార్డర్ బ్యాటర్ రికీబుయ్ ఏకంగా 175 పరుగులతో ఇన్నింగ్ చివరి వరకు ఆడాడు. మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. శశికాంత్ రెండు కీలక వికెట్లు తీశాడు. నితీష్ రెండు వికెట్లు తీయడంతోపాటు బ్యాటింగ్‌లోనూ సత్తాచాటాడు. మనీష్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. బెంగాల్ తొలుత బ్యాటింగ్ చేసి 409 పరుగులకు ఆలౌట్ కాగా ప్రతిగా ఆంధ్ర 445 పరుగులు చేసింది. ప్రతిగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ ఒక వికెట్ కోల్పోయి 82 పరుగులు చేయగా ఎటూ మ్యాచ్ ఫలితం తేలని కారణంగా చివరి రోజు రెండో సెషన్ అనంతరం డ్రాగా ముగిసింది. దీంతో ఆంధ్ర మూడు పాయింట్లు సాధించగా.. బెంగాల్ ఒక పాయింట్ సాధించింది. భారీ స్కోర్ ముందున్నా ఆధిక్యం సాధించే లక్ష్యంతోనే చివరి వరకు క్రీజ్‌లో నిలబడినట్లు టాపార్డర్ బ్యాటర్ రికీబుయ్ తెలిపారు.

29 మంది సీఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: విశాఖ రేంజ్ పరిధిలో 29 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు విశాఖ రేంజ్‌తో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నుంచి విశాఖకు, ఇక్కడి ఆయా జిల్లాలకు సీఐలను బదిలీ చేశారు.

ఇన్‌స్పెక్టర్	ప్రస్తుత ప్రాంతం	బదిలీ ప్రాంతం
జి.దుర్గాప్రసాద్	విశాఖ రేంజ్ వీఆర్	విశాఖ సిటీ
ఎస్.విద్యాసాగర్	విశాఖ రేంజ్ వీఆర్	విశాఖ సిటీ
సి.హెచ్.ప్రసాద్	విశాఖ రేంజ్ వీఆర్	విశాఖ సిటీ
టి.సీతారామ్	విశాఖ రేంజ్ వీఆర్	విశాఖ సిటీ
సి.హెచ్.శ్రీనివాసరావు	విశాఖ రేంజ్ వీఆర్	విశాఖ సిటీ
పి.శోభన్‌బాబు	విశాఖ రేంజ్ వీఆర్	విశాఖ సిటీ
ఎస్.రామకృష్ణ	శ్రీకాకుళం వీఆర్	విశాఖ సిటీ
బి.రమణమూర్తి	విశాఖ సిటీ	శ్రీకాకుళం వీఆర్
టి.వి.తిరుపతిరావు	విజయనగరం రూరల్ సర్కిల్	విశాఖ సిటీ
కె.రామారావు	విశాఖ సిటీ	విజయనగరం టూటౌన్
ఆర్.ఇ.సిహెచ్.ప్రసాద్	ఇచ్ఛాపురం	విశాఖ సిటీ
టి.ఇమ్మాన్యుయల్ రాజు	శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్	ఇచ్ఛాపురం
సి.హెచ్.సూరినాయుడు	శ్రీకాకుళం డీసీఆర్‌బీ	శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్
జి.సోమశేఖర్	విశాఖ సిటీ	శ్రీకాకుళం డీసీఆర్‌బీ
పి.శ్రీనివాసరావు	శ్రీకాకుళం టూటౌన్	విశాఖ సిటీ
జి.ఉమామహేశ్వరరావు	విశాఖ సిటీ	శ్రీకాకుళం టూటౌన్
ఎస్.బాలసూర్యారావు	విశాఖ రేంజ్ వీఆర్	పరవాడ లా అండ్ ఆర్డర్
పి.ఈశ్వరరావు	పరవాడ లా అండ్ ఆర్డర్	కాశీబుగ్గ రూరల్
జి.శంకరరావు	కాశీబుగ్గ రూరల్	అనకాపల్లి టౌన్
టి.శ్రీను	అనకాపల్లి ట్రాఫిక్	శ్రీకాకుళం సోషల్ మీడియా సైబర్ సెల్
ఎస్.హెచ్.వి.ఆనంద్	విజయనగరం టూటౌన్	కాశీబుగ్గ టౌన్
జి.నిర్మల	విశాఖ సిటీ	శ్రీకాకుళం డీటీసీ
డి.నవీన్‌కుమార్	కాశీబుగ్గ టౌన్	పాడేరు డీటీసీ
పి.రంగనాథమ్	విశాఖ రేంజ్ వీఆర్	విజయనగరం ట్రాఫిక్
బి.వి.జగన్నథరావు	విశాఖ రేంజ్ వీఆర్	విజయనగరం వీఆర్
కె.అశోక్‌కుమార్	విశాఖ సిటీ	విజయనగరం టాస్క్‌ఫోర్స్
టి.వి.విజయ్‌కుమార్	విశాఖ సిటీ	విజయనగరం సోషల్ మీడియా సైబర్ సెల్
ఎం.అప్పారావు	విశాఖ సిటీ	పార్వతీపురం సీసీఎస్
బి.ఎం.డి.ప్రసాద్	విశాఖ సిటీ	పార్వతీపురం సోషల్ మీడియా సైబర్ సెల్

ఉద్యోగులకు స్పెషల్ పెర్ఫార్మెన్స్ అవార్డులు


ఉద్యోగికి అభినందన పత్రం అందజేస్తున్న సీజీఎం సోఫ్తీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హాండ్లింగ్ ప్లాంట్ (ఆర్.ఎం.హెచ్.పి) విభాగంలో కార్మికులకు స్పెషల్ పెర్ఫార్మెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. విభాగం కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్తీ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జీఎం గౌతమ్, విభాగాధిపతి పరుచూరి శ్రీనివాస్, అధికారులు బి.సాయి, కన్నయ్య, వై.గోవిందరావు, జగదీశ్వరరావు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో మూడు టీచర్ పోస్టుల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్జీటీ ఒక పోస్టుకు 11 మంది, సంస్కృతం ఒక పోస్టుకు ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే మ్యాథమెటిక్స్ పోస్టుకు ఐదుగురు అభ్యర్థులు హాజరయ్యారు. క్వీన్ మెరీస్ పాఠశాల హెచ్‌ఎం సోమనాథ్, దేవస్థానం సూపరింటెండెంట్ విక్రమ్ తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

జానపద నృత్యపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఎమ్మెల్యే అభినందనలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: జానపద నృత్య పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించి, జాతీయ స్థాయి పోటీలకు హాజరైన విద్యార్థులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం అభినందించారు. ఈ నెల 2 నుంచి 6 వరకు భువనేశ్వర్‌లోని రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో నిర్వహించిన పోటీలకు నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు టి.నవ్యశ్రీ, టి.తేజస్వి, ప్రణీత, డాని శ్రీవల్లి, ఎ.తేజశ్రీ, ప్రియాంక సామల్ బృందం హాజరైంది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తిరిగి వచ్చిన సందర్భంగా నిర్వహించిన అభినందన సభకు ఎమ్మెల్యే నాగిరెడ్డి, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు పలక మాధవి, రాంబాబులను అభినందించారు. హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో మహిళా మార్టు ప్రారంభం


మార్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఎంపీపీ

మాకవరపాలెం: డ్వాక్రా సభ్యుల షేర్ ధనంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్టును నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం ప్రారంభించారు. మాకవరపాలెం మండలంలో 1,299 డ్వాక్రా సంఘాలకు చెందిన 14,050 మంది సభ్యులు సమకూర్చిన 35 లక్షల 12,500 రూపాయలతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ మార్టులో సరుకులను కొనుగోలు చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాల్లో తలదన్నేలా ఇక్కడ మార్టు ఉందన్నారు. ఇక్కడే ప్రజలంతా సరుకులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఇతర దుకాణాల కంటే తక్కువ ధరకు ఇంటి సామగ్రి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సచీదేవి, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, సచివాలయాల మండల కన్వీనర్ రమణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, మూకల బాలకృష్ణ, చేయూత డీపీఎం వరప్రసాద్, జీవనోపాధుల డీపీఎం శ్రీనివాస్, నర్సీపట్నం ఏరియా కో ఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎం చినబాబు పాల్గొన్నారు.

త్వరలో అడ్డురోడ్డులో..

జిల్లాలో మాడుగుల, సబ్బవరం, చోడవరం, మాకవరపాలెంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్టులను ప్రారంభించామని పీడీ శచీదేవి తెలిపారు. అడ్డురోడ్డులో త్వరలో ప్రారంభిస్తామన్నారు. మాడుగుల మార్టులో నెలకు రూ.37 లక్షల వరకు విక్రయాలతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లి వస్తూ..

- గుండెపోటుతో కార్యదర్శి హఠాన్మరణం

కోటవురట్ల: తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి తిరిగి వస్తూ.. పంచాయతీ కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం (62) కారులోనే గుండెపోటుతో మృతి చెందారు. కోటవురట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన సోమవారం తన తల్లిని నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం తిరుగు పయనమై కారు ఎక్కి బయలుదేరే సమయంలో ఒక్కసారిగా సీటులో కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తల్లికి చికిత్స చేయించి తిరిగి వస్తూ తనయుడు గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన స్వగ్రామం గొలుగొండ మండలం అమ్మపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన సుదీర్ఘ కాలం కోటవురట్లలో కార్యదర్శిగా పనిచేశారు. మరో 5 నెలల్లో ఉద్యోగ విరమణ చేయనుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సౌమ్యుడిగా, మంచి అధికారిగా అందరి మన్ననలు పొందిన ఆయన మృతితో కోటవురట్ల మండలంలోనూ విషాదం అలుముకుంది. సహచర ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనకు భార్య సుబ్బలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డాక్టర్ జగన్నాథరావుకు ప్రతిష్టాత్మక అవార్డు

తుమ్మపాల: ఫెలో ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ –2023 అవార్డును అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావుకు బహూకరించారు. ఫెలో ఆఫ్ ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అవార్డుల ప్రదానోత్సవం కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల జరిగింది. రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, ప్రాసెసింగ్ మిషనరీ వంటి అనేక సేవలు అందించినందుకు గాను బహుమతి ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.